సాక్షి చిత్తూరు

బుధవారం । 16 । అక్టోబర్ । 2024



బెస్తపల్లెలో డెంగీ కేసు నమోదు

ఐరాల మండలం బెస్తపల్లెలో పదేళ్ల బాలుడు డెంగీ బారిన పడడంతో వైద్యాధికారులు ఆ గ్రామంలో పర్యటించారు. - 10లో



పోలీసు గ్రీవెన్స్‌కు 16 ఫిర్యాదులు

చిత్తూరు నగరంలో మంగళవారం నిర్వహించిన పోలీసు గ్రీవెన్స్‌కు 16 ఫిర్యాదులు వచ్చినట్లు ఎస్పీ తెలిపారు. - 10లో



వాహన చోరీలకు తాళం

వాహనాలకు వీటీఎస్ అమర్చుకుంటే చోరీలకు తాళం వేయవచ్చని అధికారులు వినియోగదారులకు సూచిస్తున్నారు. - 10లో

న్యూస్‌రీల్

నూతన కార్యవర్గం ఎన్నిక



ఏపీ ప్రభుత్వ ఐటీఐ, డీఎల్‌టీసీ ఉమ్మడి చిత్తూరు జిల్లా నూతన కార్యవర్గం

తిరుపతి ఎడ్యుకేషన్ : తిరుచానూరు రోడ్డు, పద్మావతీపురంలోని ప్రభుత్వ ఐటీఐ కళాశాలలో సోమవారం ఏపీ ప్రభుత్వ ఐటీఐ/డీఎల్‌టీసీ ఉమ్మడి చిత్తూరు జిల్లా సంఘం నూతన కార్యవర్గాన్ని జిల్లా ఎన్‌జీఓల సంఘం అధ్యక్షులు సురేష్ బాబు ఆధ్వర్యంలో ఏకగ్రీవంగా నిర్వహించారు. ఈ ఎన్నికల్లో అధ్యక్షుడిగా ఏ.రాజు (తిరుపతి), ఉపాధ్యక్షులుగా సీ.వరదాంజనేయులు (తిరుపతి), పీ.జనార్దన (తిరుపతి), కార్యదర్శిగా పీ.సోమశేఖర (తిరుపతి), సంయుక్త కార్యదర్శులుగా వీఎస్.ధనలక్ష్మి (చిత్తూరు), సీ.గంగాధరం (తిరుపతి), కోశాధికారిగా ఎం.రవీంద్రా రెడ్డి (చిత్తూరు), కార్యవర్గ సభ్యులుగా కే.బాల మురళీప్రసాద్ (పీలేరు), డీ.లక్ష్మీకుమార్ (తిరుపతి), ఎస్.వివేక్ (చిత్తూరు), జీ.గోవిందయ్య (తిరుపతి) ఎన్నికయ్యారు. నూతన కార్యవర్గాన్ని పలువురు అభినందించారు.

దివ్యాంగులకు యూడీఐడీ కార్డు

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లా వ్యాప్తంగా ఉన్న దివ్యాంగులకు ప్రభుత్వం యూడీఐడీ (యునిక్యూ డిసెబులిటీ ఐడెంటిటీ కార్డు)ను మంజూరు చేస్తున్నట్లు జిల్లా విభిన్న ప్రతిభావంతుల శాఖ ఏడీ శ్రీనివాస్ తెలిపారు. ఆయన మంగళవారం విలేకరులతో మాట్లాడారు. జిల్లాలో ఉన్న విభిన్న ప్రతిభావంతులు ప్రభుత్వ పథకాలు పొందాలంటే యూడీఐడీ కార్డు తప్పనిసరి అని చెప్పారు. జిల్లాలోని విభిన్న ప్రతిభావంతులు తప్పనిసరిగా www. swavalambancard.gov.in వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. దరఖాస్తు చేసుకునేటప్పుడు సదరం సర్టిఫికేట్, ఆధార్ కార్డు, పాస్‌పోర్ట్ సైజు ఫొటో, తెల్లకాగితం మీద సంతకం, వేలిముద్ర అప్‌లోడ్ చేయాల్సి ఉంటుందన్నారు. నమోదు చేసుకున్న తర్వాత రశీదు వస్తుందని చెప్పారు. దరఖాస్తు చేసుకునే రోజు నుంచి 10 రోజుల అనంతరం యూడీఐడీ కార్డును వెబ్‌సైట్‌లో డౌన్‌లోడ్ చేసుకోవచ్చని ఏడీ తెలిపారు.

జిల్లాకు ఇన్‌చార్జి మంత్రిగా రాం ప్రసాద్‌రెడ్డి

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లాకు ఇన్‌చార్జి మంత్రిని నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వం మంగళవారం ఉత్తర్వులు జారీచేసింది. ఈ మేరకు రాష్ట్ర రవాణా, యువజన, క్రీడల శాఖ మంత్రి మందపల్లి రాం ప్రసాద్‌రెడ్డిని జిల్లా ఇన్‌చార్జి మంత్రిగా నియమించారు. ఆయన జిల్లాలో జరిగే అభివృద్ధి కార్యక్రమాలు, సంక్షేమ పథకాలను పర్యవేక్షించనున్నారు.

వర్షం.. నష్టం



శ్రీరంగరాజపురం: పెద్దతయ్యూరులో నేలకొరిగిన వరిపంట

తుపాను ప్రభావంతో జిల్లా అంతటా భారీ వర్షం కురుస్తోంది. దీంతో చేతికొచ్చిన వరి పంట నేలకొరిగింది. పంట పొలాల్లో వర్షపు నీరు నిలిచిపోయింది. పంట దిగుబడి తగ్గిపోతుందన్న ఆందోళన రైతుల్లో మొదలైంది. చిన్న చిన్న వాగులు, కుంటలు పొంగి ప్రవహించాయి. గ్రామీణ రోడ్లు జలమయమయ్యాయి. రాకపోకలకు తీవ్ర ఆటంకం కలిగింది. జన జీవనం స్తంభించిపోయింది. చలి తీవ్రత పెరిగింది. ఏడు మండలాల్లో అత్యధిక వర్షపాతం నమోదైంది. తుపాను ప్రభావం ఈ నెల 17వ తేదీ వరకు ఉంటుందని వాతావరణ శాఖ హెచ్చరించింది. ఈ నేపథ్యంలో 16వ తేదీ వరకు విద్యాసంస్థలకు సెలవులు ప్రకటించారు.

రోజంతా జడివాన

- నేలకొరిగిన పంటలు
- స్తంభించిన జనజీవనం
- రహదారులు జలమయం
- పెరిగిన చలి తీవ్రత
- జిల్లాలోని 7 మండలాల్లో అత్యధిక వర్షపాతం
- ఈ నెల 17 వరకు వర్ష సూచన

చిత్తూరు కలెక్టరేట్ : అల్పపీడన ప్రభావంతో జిల్లా అంతటా వర్షాలు కురుస్తున్నాయి. ఫలితంగా రైతులకు తీరని నష్టం సంభవించింది. సోమవారం అర్ధ రాత్రి నుంచి మంగళవారం రాత్రి వరకు ఎడతెరపి లేకుండా వర్షం కురుస్తోంది. గ్రామాలు, పట్టణ ప్రాంతాల్లో రోడ్లు జలమయమయ్యాయి. జిల్లా కేంద్రంతో పాటు, పలమనేరు, కుప్పం, నగరి, పూతలపట్టు, ఐరాల, నింద్ర, తదితర ప్రాంతాల్లో రోజంతా వర్షం కురుస్తూనే ఉంది. జిల్లా కేంద్రంలోని పలు కాలనీల్లో మురుగునీటి కాలువలు నిండి రోడ్లపైకి రావడంతో రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు ఎదురయ్యాయి. ఈవర్షాల నేపథ్యంలో అధికారులు పాఠశాలలకు ఈ నెల 16వ తేదీ వరకు సెలవులు ప్రకటించారు.

నింద్రలో అత్యధిక వర్షపాతం

అల్పపీడన ప్రభావంతో జిల్లాలోని పలు ప్రాంతాల్లో వర్షం ఓ మోస్తరు కురిసింది. సోమవారం అర్ధరాత్రి నుంచి మంగళవారం రాత్రి వరకు జల్లులు కురుస్తూనే ఉన్నాయి. లోతట్టు ప్రాంతాల్లో నీరు నిలిచింది. జిల్లాలోని నగరి నియోజకవర్గం నింద్ర మండలంలో అత్యధికంగా 29.4 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదుకాగా, కుప్పంలో అత్యల్పంగా 5.2 మిల్లీ మీటర్ల వర్షం కురిసింది. అలాగే జిల్లా వ్యాప్తంగా 15.3 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదు అయ్యింది. జిల్లా మొత్తం 32 మండలాల్లో వర్షపాతం నమోదు కాగా పెద్దపంజాణి మండలంలో 24.2, రామకుప్పంలో 23.4, గుడిపాలలో 23.4, శ్రీరంగరాజపురంలో 22.4, బంగారుపాళ్యంలో 20.1, పులిచెర్ల లో 20.0 మి.మీ. వర్షపాతం నమోదైంది.



నింద్ర మండలంలో నీట మునిగిన వరిపైరు

స్తంభించిన జనజీవనం



గ్రామాల్లో జలమయమైన రోడ్లు

జిల్లాలో అధిక వర్షాలకు జనజీవనం స్తంభించింది. ఉదయం నుంచి రాత్రి వరకు వరుసగా వర్షం కురుస్తుండడంతో చలి తీవ్రత పెరిగింది. వృద్ధులు, చంటిబిడ్డలు ఇబ్బందులు పడ్డారు. కార్యాలయాలకు, పనులకు వెళ్లే వారు రాకపోకలకు అవస్థలు పడాల్సిన పరిస్థితి వచ్చింది. వర్షాలతో పంట పొలాల్లోనూ మోస్తరుగా నీరు నిలిచింది. రైతులు నీటిని బయటకు పంపుతున్నారు. భారీ వర్షం కురిస్తే జిల్లాలోని పంటలు నష్టపోయే పరిస్థితులు ఉన్నాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. శ్రీరంగరాజపురం, ఐరాల, నింద్ర, పలు మండలాల్లో వరి పంట నేలకొరిగింది.



ఐరాల మండలంలో నేలవాలిన వరి పంట

యంత్రాంగం అప్రమత్తం

భారీ వర్షాల నేపథ్యంలో జిల్లా యంత్రాంగం అప్రమత్తంగా ఉంది. కలెక్టర్ సుమిత్ కుమార్ గాంధీ ఎప్పటికప్పుడు క్షేత్రస్థాయిలో పరిస్థితులను పర్యవేక్షిస్తున్నారు. అవసరమైన పాఠశాలలు, కళాశాలల్లో పునరావాస కేంద్రాలను ఏర్పాటు చేసేలా చర్యలు చేపట్టారు. సహాయక చర్యలు అందించే అగ్నిమాపక, ఎన్డీఆర్ఎఫ్ బృందాలను అందుబాటులో ఉంచారు. వర్షపు నీరు రహదారులు, వంతెనలపై ప్రవహిస్తే అటువైపు ప్రజలు వెళ్లకుండా హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలని, సిబ్బందిని కాపలాగా ఉంచాలని ఆదేశించారు. వర్షాలతో తాగునీరు కలుషితం కాకుండా తగిన చర్యలు చేపట్టాలని సూచించారు. బలమైన గాలులు, వర్షాల కారణంగా విద్యుత్ అంతరాయం ఏర్పడే అవకాశం ఉంటుందని, వెంటనే పునరుద్ధరణ చర్యలకు ఉపక్రమించాలని ఆదేశించారు.

వరి రైతుల్లో అలజడి

అల్పపీడనం ప్రభావంతో కురుస్తున్న వర్షాలతో వరి సాగు చేసిన రైతుల్లో అలజడి మొదలైంది. ఖరీఫ్ సీజన్‌లో జిల్లా వ్యాప్తంగా 1,49,963 హెక్టార్ల సాధారణ విస్తీర్ణానికి గాను 60,045 హెక్టార్లలో మాత్రమే పంట సాగు చేస్తున్నారు. అయితే కురుస్తున్న వర్షానికి వరి, ఉద్యానవన పంటలు దెబ్బతినే అవకాశం ఉంది. అధిక వర్షం వల్ల దిగుబడి తగ్గుతుందని అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు. మరోవైపు నూర్పిడికి సిద్ధంగా ఉన్న పంట నేలకొరిగిపోయింది. కోత కోయడానికి ఇబ్బందులు వస్తాయని రైతులు దిగులు చెందుతున్నారు. నగరి, జీడీనెల్లూరు, పూతలపట్టు, పలమనేరు, పుంగనూరు నియోజకవర్గాల్లో విస్తారంగా సాగు చేసిన వరి పంటకు తీరని నష్టం వాటిల్లుతోంది.

కూలిన ఇంటిపైకప్పు



చిత్తూరు రూరల్: కురుస్తున్న వర్షానికి చిత్తూరు మండలం బంగారెడ్డిపల్లిలోని కళావతి ఇంటి పైకప్పు కూలిపోయింది. దీంతో ఇంట్లోని కొంత సామగ్రి ధ్వంసమైంది. సమాచారం అందుకున్న రెవెన్యూ సిబ్బంది ఇంటిని పరిశీలించి.. అధికారులకు సమాచారం అందించారు. వారి ఆదేశాల మేరకు కూలిన ఇంటి వివరాలను నివేదికల రూపంలో సమర్పించారు. నష్ట వివరాలను అంచనా వేసి ఆర్థిక సాయం అందేలా చూస్తామని అధికారులు పేర్కొన్నారు.

మరో 48 గంటలు అప్రమత్తం



“జిల్లాలో మరో 48 గంటలు అధిక వర్షాలకు అప్రమత్తంగా ఉండాల్సిన అవసరం ఉంది. వాతావరణ హెచ్చరికల మేరకు అన్ని శాఖల అధికారులను అప్రమత్తం చేశాం. ప్రతి మూడు గంటలకు ఒక సారి క్షేత్రస్థాయిలో పరిస్థితులను పర్యవేక్షిస్తున్నాం. గురువారం వరకు వర్షాలు కురిసే అవకాశం ఉంది. సహాయక చర్యలకు కలెక్టరేట్, మండల కేంద్రాలలో కంట్రోల్ రూమ్‌లను ఏర్పాటు చేశాం. ఇప్పటి వరకు జిల్లాలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోలేదు. వర్షాలు కురిసే సమయంలో ప్రజలు వీలైనంత వరకు ఇంటికే పరిమితం కావాలి.

– సుమిత్ కుమార్ గాంధీ, కలెక్టర్, చిత్తూరు

రేయ్.. షాపు వదిలేయ్!

జిల్లాలో మద్యం వ్యాపారులకు టీడీపీ నేతల బెదిరింపులు కొనసాగుతున్నాయి. ఇప్పటికే దాదాపుగా జిల్లాలోని మద్యం దుకాణాలన్నీ అధికార పార్టీ నేతల గుప్పిట్లోకి వచ్చేశాయి. ఇక బడి లేదు.. గుడి లేదు. రహదారి నిబంధనలు అసలే లేవు. పేరుకే ఎమ్మార్పీ.. ఏ దుకాణంలో ఏ రోజు ఎంత ధరకు అమ్మాలో సిండికేట్ నిర్ణయించేసింది. ఇక ఈ రోజు నుంచి మద్యం ఏరులై పారనుంది. దుకాణాలు ఉదయం 10 నుంచి రాత్రి 10 గంటల వరకు తెరుచుకోవడానికి ప్రభుత్వం పచ్చజెండా ఊపేసింది. అయితే కూటమి ప్రభుత్వం చెప్పిన నాణ్యమైన మద్యం మాత్రం ఇంకా దుకాణాలకు చేరలేదు.

- మద్యం వ్యాపారులకు కూటమి నేతల బెదిరింపులు
- పలు ప్రాంతాల్లో ఎక్సైజ్ అధికారుల రాయబారాలు
- నేటి నుంచి కొత్త మద్యం పాలసీ అమలు
- గుడి–బడి.. జాతీయ రహదారి నిబంధనలు తూచ్!



చిత్తూరు అర్బన్: అంతా అనుకున్నట్టే జరుగుతోంది. మద్యం దుకాణాలు దక్కించుకున్న వ్యాపారులకు కూటమి ప్రజా ప్రతినిధుల నుంచి బెదిరింపులు మొదలయ్యాయి. మొన్నటి వరకు దుకాణాలకు దరఖాస్తు చేయడానికి అడ్డుపడ్డ నేతలు.. ఇపుడు వచ్చిన దుకాణాన్ని వదిలేయాలని హుకుం జారీ చేస్తున్నారు. అవసరమైతే ఎక్సైజ్ అధికారులే దగ్గరుండి దుకాణాలను అధికార పార్టీ నేతలకు అప్పగించాలని బెదిరింపులకు దిగుతున్నారు.

అధికారుల మౌనం..

మద్యం దుకాణాల్లో అధికారపార్టీ నాయకుల ఆదేశాలకు జిల్లా ఎక్సైజ్‌శాఖలోని కొందరు అధికారులు సలాం కొడుతున్నారు. గుడి–బడి నిబంధనలు ఉల్లంఘిస్తుంటే ప్రొవిజనల్ లైసెన్సుకు వారం రోజుల గడువు ఉందని, దాని తరువాత మార్చుకోవచ్చని ఉచిత సలహా ఇస్తున్నారు. అంటే వారం రోజులపాటు నిబంధనలు అతిక్రమించినా పర్లేదని చెప్పకనే చెబుతున్నారు. దీనిపై ప్రజల నుంచి ఫోన్లు వస్తుంటే కనీసం ఫోన్ తీయడంలేదు. ఇక మద్యాన్ని ఎమ్మార్పీ కంటే ఎక్కువ ధరలకు విక్రయిస్తే ఫిర్యాదు చేయడానికి ఫోన్ నెంబర్లు ఇవ్వాలి. ఈ విషయంపై అధికారులు నోరు మెదపకపోగా, ఓ జిల్లా స్థాయి అధికారి ఇప్పటి నుంచే ఫోన్ తీయడం మానేశారు. ఎమ్మార్పీ ఉల్లంఘిస్తేనే తమ వాటాలు సక్రమంగా వస్తాయని గ్రహించిన అధికారులు మౌన ముద్రలో మునిగిపోయారన్న ఆరోపణలున్నాయి. ఇప్పటి వరకు ప్రభుత్వ మద్యం దుకాణాల్లో పనిచేసిన సేల్స్‌మెన్లు, సూపర్‌వైజర్లు తమకు న్యాయం చేయాలని అధికారులను ప్రాధేయపడ్డా పట్టించుకునే దిక్కులేకుండా పోయింది.

ఇక ఇష్టారాజ్యం..

నూతన మద్యం పాలసీ బుధవారం ప్రారంభం కానుంది. నాణ్యమైన మద్యం క్వార్టర్ బాటిల్‌ను రూ.99కి తీసుకొస్తామని ప్రభుత్వం చెప్పినా.. ఇంతవరకు డిపోలకు మద్యం స్టాకు చేరలేదు. ఇక మద్యం దుకాణాల వేళలు మంగళవారం వరకు ఉదయం 11 నుంచి రాత్రి 10 గంటల వరకు ఉండేవి. బుధవారం నుంచి ఉదయం 10 నుంచి రాత్రి 10 గంటల వరకు మద్యం దుకాణాలు తెరుచుకునే అవకాశం కల్పించారు. గుడి–బడికి వంద మీటర్ల దూరం వరకు, జాతీయ రహదారులకు 500 మీటర్ల వరకు దుకాణాలు పెట్టకూడదనే నిబంధన ఉన్నా, చిత్తూరులో రెండు, నగరిలో ఒకటి, పూతలపట్టు నియోజకవర్గంలో రెండు దుకాణాలు వీటిని పాటించలేదు. నిబంధనలకు విరుద్ధంగా కొనసాగుతున్నా అడిగే దిక్కులేదు.

అంతటా అదే!

- పలమనేరులో దుకాణాలు దక్కించుకున్న ముగ్గురు వ్యాపారులకు స్థానిక ప్రజాప్రతినిధి అనుచరుల నుంచి ఫోన్‌కాల్స్ వెళ్లాయి. నియోజకవర్గంలో ఎక్కడా కూడా మద్యం దుకాణం పెట్టడానికి అన్న ఒప్పుకోలేదని బెదిరింపులకు దిగారు. కూటమి నేతను ఎదిరించే ధైర్యంలేక తమకు షాపులు వద్దని ముగ్గురూ మిన్నకుండిపోయారు. లాటరీలో దుకాణాలు వచ్చినప్పటికీ కూటమి నేతల హెచ్చరికలకు భయపడి, డబ్బులు చెల్లించలేదు. వీరికి ఎక్సైజ్ అధికారులు ఫోన్‌చేసి డబ్బులు కట్టాలని సూచిస్తే, తమకు ప్రాణాలు ముఖ్యం అంటూ ఫోన్ పెట్టేశారు. చేసేది లేక లాటరీలో రెండో నంబర్ వచ్చిన వాళ్లకు దుకాణాలు అప్పగించడానికి అధికారులు సిద్ధమవుతున్నారు.
- పూతలపట్టు నియోజకవర్గంలో 8 దుకాణాలను తమ కార్యకర్తలకు అప్పగించాలని ఎక్సైజ్ అధికారికి ఓ ప్రజాప్రతినిధి ఫోన్ చేశారు. దుకాణాలు దక్కించుకున్న వారితో రాయబారం(మధ్యస్థం) చేయాలని ఆదేశించారు. చేసేదిలేక ఎక్సైజ్ అధికారి ఇద్దరు వ్యాపారులకు ఫోన్ చేసి యోగ క్షేమాలు అడిగినట్లు అడిగి, దుకాణాలు పెట్టుకోవడానికి ఆసక్తి ఉందా అని ఆరా తీశారు. ఇంతలో అవతలి వ్యక్తి ఫోన్ కాల్ రికార్డు చేయడంతో భయపడ్డ అధికారి మరెవరికీ ఫోన్ చేయలేదు. ఈ వ్యవహారంలో తాము తల దూర్చలేమని, నాయకులే మాట్లాడుకోవాలంటూ ఆ నేతకు చెప్పేశారు.
- నగరిలో 5 దుకాణాలు తమిళనాడు వాసులకు వచ్చాయి. ఇక్కడున్న ఓ ప్రజాప్రతినిధి బావమరిది వ్యాపారులకు ఫోన్ చేశాడు. నియోజకవర్గంలో ఎక్కడా కూడా దుకాణం పెట్టొద్దని, ఎన్నికల్లో తాము చాలా డబ్బులు ఖర్చుచేశామని, దుకాణాలు తమకు అప్పగించాలని ఆదేశించాడు. వ్యాపారులు ఇందుకు అంగీకరించకపోవడంతో కనీసం దుకాణాల్లో తమ పార్టీ కార్యకర్తలకు వాటా ఇవ్వాలని లేకుంటే వ్యాపారం జరగనివ్వమని బెదిరింపులకు గురి చేస్తున్నారు.
- గంగాధర నెల్లూరులో ఓ మండల స్థాయి ప్రజాప్రతినిధి తమను కాదని దుకాణాలు పెట్టకూడదంటూ ఎక్సైజ్ అధికారులను ఆదేశించారు. ఇందులో తామేమీ చేయలేమని కావాలంటే దుకాణాలు వచ్చిన వ్యాపారాలతో మాట్లాడుకోవాలని అధికారులు సూచించడంతో తనకు తెలియకుండా మండల కేంద్రంలో ఎక్కడా దుకాణం ఇవ్వకూడదని కార్యకర్తలకు ఆదేశించాడు. ఇందులో ఓ ప్రజాప్రతినిధి తమ్ముడు కూడా వాటాలు అడుగుతున్నట్లు ఆరోపణలున్నాయి.
- చిత్తూరులో అధికార పార్టీకి చెందిన ద్వితీయ శ్రేణి నాయకుడు సిండికేట్ల ఏర్పాటు తన కనుసన్నల్లో జరగాలని వ్యాపారులకు ఫోన్లు చేసి బెదిరిస్తున్నాడు. స్థానిక ప్రజాప్రతినిధి పేరు చెప్పి లాభాల్లో 25% వాటాలు ఇవ్వాల్సిందేనని పట్టుబడుతున్నాడు. వ్యాపారులంతా దీనికి సమ్మతించాలని కండీషన్ పెట్టాడు. దీనికి వ్యాపారులు ఒప్పుకోవడంలేదు.

గీత కార్మికులకు దుకాణాలేవి..?

ఇక తొలి విడతలో 104 దుకాణాల టెండర్ల ప్రక్రియ పూర్తయ్యింది. కూటమి ప్రభుత్వం చెప్పినట్టు కల్లు గీత కార్మికులకు దుకాణాల్లో 10 శాతం రిజర్వేషన్ కేటాయిస్తామన్న హామీపై ఎలాంటి ప్రకటనలేదు. జిల్లాలో 11 దుకాణాలు గీత కార్మికులకు ఇవ్వాల్సి ఉన్నా, ఇంత వరకు ఎక్కడ దుకాణాలు పెట్టాలి..? లైసెన్సు ఫీజు ఎంత పెట్టాలి..? అనే విషయాలపై ప్రభుత్వం నుంచి స్పష్టతలేదు.

మద్యం మాఫియా ఆరంభం

- ఎమ్మెల్యేలు, మంత్రుల గుప్పిట్లో దుకాణాలు
- ఒక్కో మద్యం షాపు ద్వారా 15 బెల్ట్ షాపులకు రంగం సిద్ధం
- మాజీ ఉప ముఖ్యమంత్రి కళత్తూరు నారాయణస్వామి



పుత్తూరు: రాష్ట్రంలో మద్యం మాఫియాను సీఎం చంద్రబాబు ప్రారంభించారని మాజీ ఉప ముఖ్యమంత్రి కళత్తూరు నారాయణస్వామి తెలిపారు. పుత్తూరులోని తన నివాసంలో ఆయన మంగళవారం మీడియాతో మాట్లాడారు. అధికార పార్టీ ఎమ్మెల్యేలు, మంత్రుల కనుసన్నల్లో జరిగిన లక్కీడిప్ తతంగంలో ఆ పార్టీ అనుచరులకే మద్యం షాపులను కట్టబెట్టారని ఆరోపించారు. ఇందులో మహిళలను పెద్ద ఎత్తున భాగస్వామ్యం చేయడం సిగ్గుచేటన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా జరిగిన ఈ దౌర్జన్య కేటాయింపులు అన్ని ప్రచార మాధ్యమాల్లో హల్‌చల్ చేసిన విషయాన్ని ప్రజలందరూ చూశారన్నారు. చంద్రబాబు రాష్ట్రాన్ని మద్యంలో ముంచేందుకు రంగం సిద్ధం చేశారని విమర్శించారు. ఎమ్మార్పీపై ధర పెంచి ప్రజల నుంచి దోచుకోవడానికి అధికారికంగా లైసెన్సులు ఇచ్చారని ఆరోపించారు. ఒక్కో మద్యం షాపు ద్వారా 15 నుంచి 20 బెల్ట్ షాపులు నడిపేందుకు ప్రణాళిక రచించారని చెప్పారు. చంద్రబాబు దోచుకోవడానికే 3,396 షాపులతో ఈ ప్రైవేటు పాలసీని తీసుకొచ్చారని దుయ్యబట్టారు. నిన్నటివరకు మద్యం షాపుల్లో పనిచేస్తున్న 15 వేల మంది ఉద్యోగులు రోడ్డున పడ్డారని ఆవేదన వ్యక్తం చేశారు. వీరి కుటుంబాలను ఆదుకునేదెవరని ప్రశ్నించారు. ఎన్నికల్లో మేనిఫెస్టో ద్వారా సూపర్ సిక్స్‌ను ప్రకటించిన చంద్రబాబు వాటి ఊసే ఎత్తడం లేదన్నారు.

వినతులు రీ ఓపెన్ అయితే చర్యలు



సమీక్షలో మాట్లాడుతున్న జాయింట్ కలెక్టర్ విద్యాధరి

చిత్తూరు కలెక్టరేట్ : ప్రజా సమస్యల పరిష్కార వేదికలో నమోదయ్యే ప్రజల వినతులు పరిష్కారానికి నోచుకోకుండా రీ ఓపెన్ అయితే చర్యలు తప్పవని జాయింట్ కలెక్టర్ విద్యాధరి హెచ్చరించారు. ఆమె మంగళవారం కలెక్టరేట్‌లో పలు శాఖల అధికారులతో వరుస సమీక్ష సమావేశాలు నిర్వహించారు. జేసీ మాట్లాడుతూ కలెక్టరేట్‌లో నిర్వహించే ప్రజా సమస్యల పరిష్కార వేదికలో నమోదయ్యే వినతులను క్షేత్రస్థాయి అధికారులు బాధ్యతగా పరిష్కరించాలన్నారు. ఎట్టి పరిస్థితుల్లోనూ అలసత్వం వహించకూడదని తెలిపారు. ప్రతి వినతిని పరిశీలించి పరిష్కరించాలని ఆదేశించారు. రెవెన్యూ, పోలీసు శాఖలకు సంబంధించి అధికంగా అర్జీలు వస్తున్నట్లు తెలిపారు. వినతులను పరిష్కరించిన తర్వాత అర్జీదారునికి తప్పనిసరిగా ఎండార్స్‌మెంట్ ఇవ్వాలన్నారు. ఒక వేళ వినతి రీ ఓపెన్ అయితే అందుకు గల కారణం తెలియజేయాలని స్పష్టం చేశారు.

గిరిజనులందరికీ ఆధార్ కార్డులుండాలి

జిల్లాలో గిరిజనులందరికీ ఆధార్ కార్డులు తప్పనిసరిగా ఉండాలని జేసీ ఆదేశించారు. ఎంపీడీఓలు ముందుగా వారికి జనన ధ్రువీకరణ పత్రం మంజూరు చేయాలని సూచించారు. సంచార ఆధార్ కేంద్రాలను ఏర్పాటు చేయనున్నట్లు వివరించారు. సమీక్షలో జిల్లా గిరిజన సంక్షేమ శాఖ అధికారి మూర్తి, జెడ్పీ సీఈఓ రవికుమార్‌నాయుడు, డీఎల్‌డీఓ రవికుమార్ పాల్గొన్నారు.

క్లుప్తంగా

ఆగని గజ దాడులు



బెస్తపల్లి వద్ద ఏనుగులు తొక్కేసిన వరిపైరు

కల్లూరు(పులిచెర్ల): మండలంలోని పంట పొలాలపై ఏనుగుల దాడులు ఆగడం లేదు. దీంతో ఆ ప్రాంతాల్లోని రైతులు తీవ్రంగా పంట నష్టపోతున్నారు. మంగళవారం ఉదయం మండలంలోని బెస్తపల్లి సమీపంలోని వరిపంటలో చొరబడిన ఏనుగుల గుంపు పైరును తొక్కి నాశనం చేశాయి. మామిడి తోటల్లో కంచెగా వేసిన రాతికూసాలను విరిచి వేశాయి. గుంపులు, గుంపులుగా ఏనుగులు గత పది రోజులుగా పంటలను నాశనం చేస్తున్నాయి. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి తగుచర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.

అయ్యా.. మాకు న్యాయం చేయండి



తహసీల్దార్‌తో మాట్లాడుతున్న ముద్దరామాపురం గ్రామస్తులు

యాదమరి(పూతలపట్టు): కొన్ని సంవత్సరాలుగా ఒకే చోట నివసిస్తున్న గ్రామస్తులు అటవీ అధికారుల హెచ్చరికలతో భయపడి, న్యాయం చేయాలంటూ తహసీల్దార్‌కు మంగళవారం విన్నవించుకున్నారు. యాదమరి మండలం ముద్దరామాపురం ఎస్సీ కాలనీకి చెందిన 45 కుటుంబాలు 135/1లో గల సర్వే నెంబర్‌లో రెవెన్యూ అధికారులు అందజేసిన ఇందిరమ్మ పట్టా స్థలంలో ఇల్లు కట్టుకొని జీవనం సాగిస్తున్నారు. ఆ లే అవుట్‌లో విద్యుత్, తాగునీరు, సీసీరోడ్లు వంటి సదుపాయాలను ప్రభుత్వం కల్పించింది. ఆ గ్రామంలో కొందరు ఇంటి పరిసరాలను శుభ్రం చేస్తుంటే అటవీ అధికారులు గ్రామంలోకి చొరబడి ఇది అటవీశాఖ స్థలమని చెప్పి ఖాళీ చేయాలంటూ బెదిరిస్తున్నారని చెప్పారు. అర్జీని స్వీకరించినంతరం తహసీల్దార్ స్పందిస్తూ, అటవీ అధికారులతో మాట్లాడి తప్పకుండా గ్రామస్తులకు న్యాయం చేస్తానని హామీ ఇచ్చారు.

డీఎల్‌పీఓగా పార్వతి



చిత్తూరు కార్పొరేషన్: డివిజనల్ స్థాయి పంచాయతీ శాఖ అధికారి(డీపీఓ)గా పార్వతి మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. ఆమె అన్నమయ్య జిల్లా రాజంపేట నుంచి ఇక్కడికి బదిలీపై వచ్చారు. గతంలో ఇక్కడ డీఎల్‌పీఓ, ఇన్‌చార్జి డీపీఓగా ఉన్న లక్ష్మి కర్నూలు జిల్లాకు బదిలీపై వెళ్లారు. ఆమె స్థానంలోకి వచ్చిన పార్వతి ప్రస్తుతం ఇన్‌చార్జి డీపీఓగా కూడా వ్యవహరించనున్నారు.

వాహన చోరీలకు తాళం

- వెహికల్ ట్రాకింగ్ సిస్టమ్(వీటీఎస్)తో పెక్కు ప్రయోజనాలు
- చోరీ చేసిన దొంగలను ఇట్టే పట్టేయచ్చు
- వీటీఎస్ టెక్నాలజీని వాడాలంటున్న రవాణా, పోలీసుశాఖ


పలమనేరు: లక్ష రూపాయలుపెట్టి బుల్లెట్ కొనేవాళ్లు వెయ్యి పెట్టి సెక్యూరిటీ సిస్టంను అమర్చడం మరిచిపోతున్నారు. దీంతో ఇళ్లముందు లాక్‌చేసిన బైక్‌లు సైతం చోరీలకు గురవుతున్నాయి. సీసీ కెమెరాలున్నప్పటికీ దొంగలు మాస్కుల ముసుగులో చాలా సులభంగా వాహనాలను తస్కరిస్తున్నారు. ఇక లారీల విషయంలో యజమానులకు ఆందోళన తప్పడం లేదు. దూర ప్రాంతాలకు లోడ్డుతో బయలుదేరిన బండి గమ్యం చేరే వరకూ గ్యారంటీ లేని పరిస్థితి నెలకొంది. ఇలాంటి కష్టాలను తీర్చేందుకు నూతన సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించాల్సిన అవసరం ఎంతైనా ఉంది. ఇప్పుడు ద్విచక్ర వాహనాల కోసం వాహన్ రక్ష అనే డివైజ్‌తో పలు కంపెనీల సెక్యూరిటీ డివైజ్‌లు అందుబాటులో ఉన్నాయి. పెద్ద వాహనాలైన లారీలు, ప్రైవేటు బస్సులకైతే వీటీఎస్ (వెహికల్ ట్రాకింగ్ సిస్టం)ను ఏర్పాటు చేసుకోవాలని పోలీసులు, మోటార్ వాహనాల శాఖ అధికారులు సూచిస్తున్నారు.

దీంతో ఎన్నో లాభాలు

ముఖ్యంగా పాల ట్యాంకులు, ఆయిల్ ట్యాంకులకు, మున్సిపల్, కార్పొరేషన్‌లో సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్ వాహనాలకు డంపింగ్ సిస్టమ్‌లో ఎంతగానో ఉపయోగం. భారీ కంటైనర్లు, ప్రచార వాహనాలు, విలువైన వస్తువులను తీసుకెళ్లే లారీలకు దొంగల బారినుంచి ఎంతో మేలు. ఇక అంబులెన్స్‌లకు సంబంధించి ఫోన్ చేసినపుడు వాహనం ఎక్కడ వస్తోంది. ఆస్పత్రికి ఎంతసేపట్లో చేరుతుంది అనే సమాచారం తెలుసుకోవచ్చు. ఫైర్ సర్వీసెస్‌లోనూ ఉపయోగమే. బ్యాంకులకు భారీ మొత్తంలో నగదును తరలించేటపుడు ఆ వాహనం ఎక్కడుందో తెలుసుకోవచ్చు. పబ్లిక్ ట్రాన్స్‌పోర్ట్ సిస్టమ్‌కు సంబంధించి పట్టణాల్లో ఆటోలు, టాక్సీలు తదితరాలకు వీటిని ఏర్పాటు చేసి పోలీసు హెడ్ క్వార్టర్స్‌లో అనుసంధానం చేసుకుంటే దొంగల ఆట కట్టించవచ్చు.



బైక్‌ల చోరీని గుర్తించే సెక్యూరిటీ డివైజ్



వాహనాల్లో అమర్చే జీపీఆర్ఎస్

వాహన రక్ష ఇలా పనిచేస్తుంది

అయాన్ టెక్నాలజీవారు తయారు చేసిన వాహన రక్ష డివైజ్‌తోపాటు ఆన్‌లైన్ లేదా ఆఫ్‌లైన్‌లోనూ కావాల్సిన వెహికల్ డివైజ్‌లు అందుబాటులో ఉన్నాయి. వీటిని వాహనాలు అమర్చుకుంటే చోరీలకు కళ్లెం వేసినట్టే. ఎవరైనా బైక్‌ను చోరీ చేస్తే డివైజ్ యాక్టివేట్ అయి ఇంజిన్ స్టార్ట్ కాకుండా అవుతుంది. దీంతో దొంగ ఎన్ని ప్రయత్నాలు చేసినా ఇక లాభం ఉండదు. బైక్‌లోని డివైజ్‌ను తొలగిస్తే బైక్ హార్న్ మోగడంతో పాటు బండి స్టార్ట్ కాదు. దీంతో చోరీ చేయడం అసాధ్యం. దీనికి తోడు జీపీఆర్ఎస్ వాహనదారు మొబైల్‌కు అనుసంధానమై ఉంటుంది కాబట్టి మొబైల్‌కు అలెర్ట్ మెసేజ్ కూడా వస్తుంది.

వీటీఎస్ ఎలా పనిచేస్తుందంటే..

ఇది పూర్తిగా వెబ్‌ఆధారంగా పనిసేస్తుంది. మనం ఎంచుకున్న వాహనంలో ఓ జీపీఆర్ఎస్, ఆర్ఎఫ్ఐడీ యూనిట్‌ను అమర్చుకోవాలి. జీపీఎస్ శాటిలైట్‌నుంచి సిగ్నల్స్ ఆ యంత్రానికి వచ్చి అక్కడినుంచి సెల్‌టవర్ ద్వారా సర్వర్‌కు వస్తాయి. సర్వర్‌నుంచి యూజర్‌కు వివరాలు ఎల్లవేళలా అందుబాటులో ఉంటాయి. వీటిని కంప్యూటర్, ల్యాప్‌టాప్, స్మార్ట్ ఫోన్, ఐప్యాడ్‌లకు అనుసంధానం చేసుకోవచ్చు. ఇందుకు సంబంధించిన ఎన్నో రకాల సాఫ్ట్‌వేర్ అప్లికేషన్లు ప్రస్తుతం అందుబాటులో ఉన్నాయి. తద్వారా వాహనం ఎక్కడ వెళుతోందో తమ మొబైల్‌లోనూ చూసుకోవచ్చు.

వెహికల్ ట్రాకింగ్ ఎంతో మేలు

వాహనం ఎక్కడ ఉందో గుర్తించేందుకు వెహికల్ ట్రాకింగ్ సిస్టమ్ ఎంతో ఉపయుక్తంగా మారింది. సరుకు రవాణా చేసే లారీలు గమ్యస్థానం చేరే దాకా యజమానికి ఆందోళన సహజం. విలువైన సరుకును రవాణా చేసేటపుడు లారీలను మార్గ మధ్యంలో హైజాక్ చేసే అవకాశాలుంటాయి. లారీలేకాదు ఏవాహనానికైనా జీపీఆర్ఎస్ అమర్చుకుంటే అది ఎక్కడుందో తెలుసుకోవడం సులభంగా ఉంటుంది. దూర ప్రాంతాలనుంచి ఒంటరిగా బస్సెక్కి వచ్చేటపుడు తమ వారు ఎక్కడొస్తున్నారో సురక్షితంగా ఉన్నారోలేరోననే కుటుంబీకులకు ఆరాటం. కొత్త ప్రాంతాల్లో ముఖ్యంగా మహిళలు టాక్సీల్లో ప్రయాణించేటపుడు గమ్యస్థానం చేరేంతవరకు ఆందోళన ఉంటుంది. ఇలా ప్రతి విషయంలోనూ భరించలేని టెన్షన్. వీటిన్నంటిని మరచిపోయి నిశ్చింతగా ఉండేందుకు వచ్చిందే స్మార్ట్ వెహికల్ ట్రాకింగ్ సిస్టమ్. ఇది అభివృద్ధి చెందిన దేశాల్లో ఇప్పటికే విజయవంతంగా అమలవుతోంది. మన ప్రాంతంలోనూ జీపీఆర్ఎస్‌ను వాహనాలకు అమర్చుకోవాలంటూ ఎంవీఐ అధికారులు సూచిస్తున్నారు. ఇప్పటికే పలు కార్పొరేట్ స్కూల్స్, కళాశాల బస్సులకు దీన్ని అమలు చేస్తున్నారు. ఇక కొన్ని ప్రైవేటు బస్సు సర్వీసులు సైతం వెబ్ ఆధారిత సేవలను ప్రారంభించాయి. ఆర్టీసీ బస్సుల్లోనూ ఈ సేవలు ప్రస్తుతం అందుబాటులో ఉన్నాయి.

జీపీఆర్ఎస్ అమర్చుకుంటే భద్రత



వాహనాలకు జీపీఆర్ఎస్ ఉంటే అదెక్కడుందో ఇట్టే తెలిసిపోతుంది. అందుకే తాము కూడా జీపీఆర్ఎస్ అమర్చుకోవాలని వాహన యజమానులకు సూచిస్తున్నాం. ఏ వాహనానికైనా జీపీఆర్ఎస్ పెట్టుకోవడం చాలా ఉపయోగం. ముఖ్యంగా చోరీలకు గురవకుండా ఉండేందుకు వీలుంటుంది. వాహనదారులు తప్పకుండా అమర్చుకోవడం ఉత్తమం.

– మధుసూదన్, ఎంవీఐ, పలమనేరు

మహిళపై కత్తితో దాడి



నిందితుడు ప్రవీణ్(ఫైల్)



దాడిలో గాయ పడిన మహిళ

రొంపిచెర్ల: యువకుడు ఒక మహిళపై దాడి చేసి తీవ్రంగా గాయపరిచిన సంఘటన వారణాసివారిపల్లెలో మంగళవారం చోటుచేసుకోంది. బాధితుల కథనం మేరకు, వారణాసివారిపల్లెకు చెందిన శ్రీనివాసులు భార్య రోజా(30) మంగళవారం మధ్యాహ్నం పశువులను మేపుకునేందుకు సమీపంలోని పొలాల వద్దకు వెళ్లింది. మహిళ ఒంటరిగా ఉందని గ్రహించిన అదే గ్రామానికి చెందిన ప్రవీణ్(21) బంగారు నగల కోసం ఆమెపై కత్తితో దాడి చేసి గాయ పరిచారు. దీంతో ఆమె కేకలు వేయడంతో చట్టు పక్కల వారు వచ్చి ఆమెను చికిత్స కోసం ఆస్పత్రికి తరలించారు. మెడపైన చేతుల మీద కత్తితో కోయడంతో సుమారు 80 కుట్లు పడ్డాయని తెలిపారు. మెరుగైన చికిత్స కోసం తిరుపతి రుయా ఆస్పత్రికి తరలించారు. ఈ విషయమై పోలీసులను సంప్రదించగా ఎలాంటి ఫిర్యాదు అందలేదని ఎస్ఐ సుబ్బారెడ్డి తెలియజేశారు.

డ్రంక్ అండ్ డ్రైవ్ కేసుల్లో రూ.2 లక్షల జరిమానా

చిత్తూరు అర్బన్: మద్యం తాగి వాహనాలు నడిపిన 21 మందికి రూ.2.10 లక్షల జరిమానా విధిస్తూ చిత్తూరులోని ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి ఉమాదేవి మంగళవారం తీర్పునిచ్చారు. చిత్తూరు ట్రాఫిక్ సీఐ నిత్యబాబు గత రెండు రోజులుగా సోమవారం వాహనాలు తనిఖీ చేస్తుండగా పలువురు మద్యం తాగి వాహనాలు నడుపుతున్నట్లు గుర్తించారు. మొత్తం 21 మందిపై కేసు నమోదుచేసి, కోర్టుకు తరలించారు. ఒక్కొక్కరికి రూ.10 వేలు చొప్పున మొత్తం రూ.2.10 లక్షల జరిమానా విధిస్తూ న్యాయమూర్తి తీర్పునిచ్చారు.

నూతన ఎస్ఈగా ఇస్మాయిల్ అహ్మద్



చిత్తూరు కార్పొరేషన్: చిత్తూరు జిల్లా ట్రాన్స్‌కో నూతన ఎస్ఈగా ఇస్మాయిల్‌అహ్మద్ మంగళవారం రూరల్ డివిజన్ కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాకు కొత్తగా సర్కిల్ కార్యాలయం కేటాయించారన్నారు. తొలి ఎస్ఈగా రావడం ఆనందంగా ఉందన్నారు. అధికారులు, సిబ్బందిని సమన్వయం చేసుకుని పనిచేయనున్నట్లు వెల్లడించారు. తుపాను నేపథ్యంలో క్షేత్రస్థాయి సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని, ఆయనను తిరుపతి జిల్లా ఎస్ఈ సురేంద్రనాయుడు, క్వాలిటీ కంట్రోల్ జీఎం మురళీ, ఈఈలు సురేష్, మునిచంద్ర, అమర్‌బాబు, జగదీష్, శ్రీనివాసమూర్తి, ఉద్యోగ సంఘం రాష్ట్ర నాయకులు దేవేంద్రరెడ్డి, డీఈ, ఏఈ, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

కిడ్నాప్ చేశారని ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదు

చిత్తూరు రూరల్ (కాణిపాకం): తన భార్య, బిడ్డను కిడ్నాప్ చేసిన రైల్వే పోలీస్ కానిస్టేబుల్‌పై ఫిర్యాదు చేసి 15 రోజులు గడుస్తున్నా ఇప్పటి వరకూ చర్యలు చేపట్టలేదని పెనుమూరు మండలం మాదిగపల్లెకు చెందిన పట్టాభి తెలిపారు. ఆయన మంగళవారం చిత్తూరు ప్రెస్‌క్లబ్‌లో మాట్లాడుతూ తనపై కక్ష పెంచుకొని తన భార్య, బిడ్డను రైల్వే పోలీస్ కానిస్టేబుల్ జ్ఞానేశ్వర్ కిడ్నాప్ చేశాడన్నారు. దీనిపై తాలూకా పోలీస్ స్టేషన్‌లో కూడా ఫిర్యాదు చేసినట్లు చెప్పారు. అతని నుంచి తన భార్య, బిడ్డకు ప్రాణహాని ఉందని, వెంటనే పోలీసులు తమకు న్యాయం చేయాలని వేడుకున్నారు.

శ్రీవారి దర్శనానికి 20 గంటలు

తిరుమల: తిరుమలలో భక్తుల రద్దీ పెరిగింది. క్యూకాంప్లెక్స్‌లో కంపార్ట్‌మెంట్లన్నీ నిండాయి. క్యూలైను ఏటీసీ వద్దకు చేరింది. సోమవారం అర్ధరాత్రి వరకు 75,361 మంది స్వామివారిని దర్శించుకోగా 28,850 మంది భక్తులు తలనీలాలు సమర్పించారు. స్వామివారికి కానుకల రూపంలో హుండీలో రూ.3.91 కోట్లు సమర్పించారు. టైంస్లాట్ టిక్కెట్లు కలిగిన భక్తులకు సకాలంలోనే దర్శనమవుతోంది. దర్శన టిక్కెట్లు లేని భక్తులకు 20 గంటల్లో దర్శనం లభిస్తోంది. ప్రత్యేక ప్రవేశ దర్శనం టిక్కెట్లు కలిగిన భక్తులకు 2 గంటల్లో దర్శనం లభిస్తోంది.

జిల్లాకు రూ.కోటి విడుదల

చిత్తూరు కలెక్టరేట్: తుపాను సహాయక చర్యల కోసం జిల్లాకు కోటి రూపాయల సాయం విడుదల చేస్తూ మంగళవారం ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసిందని డీఆర్వో పుల్లయ్య తెలిపారు. అల్పపీడన ద్రోణి ప్రభావంతో తుపానుగా మారి రానున్న రెండు రోజుల్లోపాటు భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందన్నారు. దీనిపై ప్రభుత్వం అప్రమత్తం చేస్తూ సహాయక చర్యల నిమిత్తం జిల్లాకు నిధులు విడుదల చేసిందని వివరించారు.

పోలీసు గ్రీవెన్స్‌కు 16 ఫిర్యాదులు

చిత్తూరు అర్బన్: పోలీసుశాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్) కార్యక్రమానికి 16 ఫిర్యాదులు అందాయి. చిత్తూరులోని పోలీసు ఆర్మడు రిజర్వు కార్యాలయంలో మంగళవారం ఎస్పీ మణికంఠ ప్రజల నుంచి ఫిర్యాదులు, వినతులు స్వీకరించారు. ఆయన మాట్లాడుతూ ప్రజల నుంచి వచ్చే సమస్యలను పరిష్కరించడంలో అధికారులు క్షేత్రస్థాయిలో విచారణ చేపట్టాలన్నారు. ఇందులో కుటుంబ తగాదాలు, వేధింపులు, డబ్బు తగాదాలు, భూ తగాదాలు, ఆస్తి తగాదాలకు సంబంధించిన ఫిర్యాదులున్నాయి. వచ్చిన ప్రతి ఫిర్యాదుపై క్షేత్రస్థాయిలో విచారణ చేపట్టి వాటిని పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. వీటిని ఆన్‌లైన్‌లో సైతం నమోదు చేయాలన్నారు.

23న హుండీ లెక్కింపు

కాణిపాకం: కాణిపాకంలోని శ్రీ వరసిద్ధివినాయకస్వామి దేవస్థాన హుండీ కానుకలను ఈ నెల 23వ తేదీ నుంచి లెక్కిస్తున్నట్లు ఈవో గురుప్రసాద్ తెలిపారు. ఆస్థాన మండపంలో ఉదయం 7గంటలకు లెక్కింపు ప్రారంభమవుతుందన్నారు. అధికారులు, సిబ్బంది విధిగా హాజరు కావాలని ఆయన పేర్కొన్నారు.

బాల్య వివాహం చేసుకున్న వ్యక్తిపై పోక్సో కేసు



నిందితుడు కోటిని అరెస్టు చేసిన పోలీసులు

శ్రీరంగరాజపురం : బాలికను నమ్మించి వివాహం చేసుకున్న వ్యక్తిపై పోలీసులు పోక్సో కేసు నమోదు చేసి రిమాండ్‌కు పంపించారు. కార్వేటినగరం సీఐ హనుమంతప్ప కథనం మేరకు, శ్రీరంగరాజపురం మండలం ఏఎం పురం ఆది ఆంధ్రవాడకు చెందిన ఓ మహిళ తన కుమార్తె (16) కనిపించడం లేదని ఈ నెల 6వ తేదీ స్థానిక పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కేసు నమోదుచేసిన పోలీసులు దర్యాప్తు చేపట్టారు. ఈ నెల 12వ తేదీన సదుంలోని ఓ హోటల్ గదిలో ఉన్నట్టు తెలుసుకున్నారు. అక్కడ బాలికను గుర్తించారు. బాలికను విచారించగా తనకు మాయమాటలు చెప్పి, తనను నమ్మించి తనకు సమీప బంధువు అయిన పాకాల మండలం దొౌట్టి పల్లెకి కోటి, అతని సమీప బంధువులు సదుంలోని శ్రీసుబ్రమణ్యంస్వామి ఆలయంలో వివాహం చేసినట్లు తెలిపింది. సదుంకు పోలీసులు చేరుకున్న విషయం తెలుసుకున్న కోటి పరారయ్యాడు. కోటిని మంగళవారం 49 కొత్త పల్లిమిట్ట వద్ద సీఐ హనుమంతప్ప, ఎస్ఐ సుమన్ అరెస్టు చేశారు. అతనిపై పోక్సో కేసు నమోదు చేసి, రిమాండ్‌కు పంపించారు. బాల్య వివాహానికి సహకరించిన కోటి బంధువులపై కూడా కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

రైతు ప్రయోజనాలకే ఈ-క్రాప్



గ్రామ సభలో మాట్లాడుతున్న జిల్లా ఏఓ ప్రసాదరావు

పుత్తూరు: రైతుల ప్రయోజనాల కోసమే ఈ క్రాప్ నమోదు నిర్వహిస్తున్నట్లు జిల్లా వ్యవసాయాధికారి ప్రసాదరావు తెలిపారు. వడమాలపేట మండలం పాదిరేడు గ్రామంలో మంగళవారం ఈ క్రాప్ సామాజిక తనిఖీ గ్రామ సభ నిర్వహించారు. ఆకస్మికంగా తనిఖీ చేసిన ప్రసాదరావు మాట్లాడుతూ ప్రతి రైతు ఈ క్రాప్ నమోదు చేసుకోవాలని కోరారు. నమోదు చేసుకున్న వారికి మాత్రమే పంట బీమా, మద్దతు ధర వంటి ప్రయోజనాలు అందుతాయని స్పష్టం చేశారు. ఖరీఫ్–2024 సీజన్‌లో ఈ క్రాప్ నమోదు చేసుకున్న రైతులు తమ సందేహాలను గ్రామ సభల్లో నివృత్తి చేసుకోవాలని సూచించారు. వడమాలపేట మండలంలో 2,227 మంది రైతులు 6,177 ఎకరాల్లో ఈ క్రాప్ నమోదు చేసుకున్నట్లు చెప్పారు. మండలంలోని అన్ని రైతు సేవా కేంద్రాల వద్ద ఈ క్రాప్ ముసాయిదా జాబితాను సామాజిక తనిఖీ నిమిత్తం ఈ నెల 18వ తేదీ వరకు ప్రదర్శించనున్నట్లు తెలిపారు. జాబితాలో అభ్యంతరాలు ఉంటే రైతు భరోసా కేంద్రాల్లో రాతపూర్వకంగా తెలియజేయాలని కోరారు. ఖరీఫ్ సీజన్ సవరణలకు ఇది చివరి అవకాశమని, రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి విజయ్‌కుమార్, వీఏఏలు, రైతులు పాల్గొన్నారు.

అట్టహాసంగా ఎస్‌జీఎఫ్ క్రీడలు



జిల్లా స్థాయి ఫెన్సింగ్ పోటీల్లో ఎంపికైన క్రీడాకారుల జట్టు

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లా కేంద్రంలోని మెసానికల్ మైదానంలో మంగళవారం ఎస్‌జీఎఫ్ (స్కూల్ గేమ్స్ ఫెడరేషన్) క్రీడా పోటీలు అట్టహాసంగా నిర్వహించారు. ఈ పోటీలకు జిల్లాలోని అన్ని ప్రాంతాల నుంచి విద్యార్థులు పాల్గొన్నారు. అండర్ 14 విభాగంలో బాల, బాలికల జట్లకు పోటీలు నిర్వహించారు. అండర్ 14 బాలుర జట్టులో గోపి (సిద్ధంపల్లి), గిరివర్ధన్ (పూతలపట్టు), జాన్‌లూక్ (కాణిపాకం), తరుణ్ (యాదమరి), డిల్లీబాబు (కాణిపాకం), సంతోష్ (గుర్రంకొండ), జగన్ (సిద్ధంపల్లి), గిరీష్ (ఎల్ఆర్ పురం), ముజాహిద్ (గుర్రంకొండ), యూసఫ్ (యాదమరి), నితీష్ (సిద్ధంపల్లి), పవన్ (ఐరాల) గెలుపొందారు. బాలికల జట్టులో కీర్తన (గుర్రంకొండ), ఫాతిమా (యాదమరి), ధనుష్య (యాదమరి), లాలూష (సిద్ధంపల్లి), దేవీప్రియ (కాణిపాకం), లోహిత (యాదమరి), హర్షియ (యాదమరి), కావ్య, వీక్షిత (యాదమరి), మిస్‌బా (యాదమరి), భవిత (ఐరాల), భవ్యశ్రీ (గుర్రంకొండ) గెలుపొంది రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. జిల్లా స్థాయిలో ఎంపికైన క్రీడాకారులు నంద్యాల జిల్లాలో ఈ నెల 17వ తేదీ నుంచి 19వ తేదీ వరకు నిర్వహించే రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటారని ఎస్జీఎఫ్ జిల్లా సెక్రటరీ వసంతవాణి తెలిపారు. ఈ పోటీల నిర్వహణలో పీడీ రవీంద్రారెడ్డి, సెల్వపాండ్యన్, కృష్ణ, సిరాజ్, బాబు తదితరులు పాల్గొన్నారు.

బెస్తపల్లెలో డెంగీ కేసు నమోదు

ఐరాల: మండలంలోని బెస్తపల్లెలో డెంగీ కేసు నమోదైనట్లు జిల్లా మలేరియా అధికారి డాక్టర్ అనిల్‌కుమార్ తెలిపారు. గ్రామంలో గణేష్ కుమారుడు దినేష్(10)కు డెంగీగా నిర్ధారణ అయింది. దీంతో మంగళవారం డాక్టర్ అనిల్‌కుమార్ స్థానిక పీహెచ్‌సీ వైద్యాధికారి ప్రవీణ్ కుమార్, సిబ్బంది బెస్తపల్లెకు వెళ్లి నివారణ చర్యలు చేపట్టారు.సుమారు 20 ఇళ్లలో లార్వాను గుర్తించి, లార్వా ఉన్న నీటిని పారబోశారు. అనంతరం ఆయన గ్రామస్తులకు దోమల ద్వారా వచ్చే వ్యాధులపై, నీటి నిల్వలను నిల్వ చేసుకునే పద్ధతులపై అవగాహన కల్పించారు. గ్రామంలో నూతనంగా నిర్మించిన ఇళ్ల సంపుల్లో నీటి నిల్వను పరిశీలించి ప్రజలకు అవగాహన కల్పించాలని సంబంధిత ఏఎన్ఎం, ఆశా కార్యకర్తకు సూచించారు. గ్రామంలో ప్రతి శుక్రవారం డ్రైడే కార్యక్రమాన్ని సక్రమంగా నిర్వహించకపోతే తీవ్ర చర్యలు ఉంటాయని సిబ్బందిని హెచ్చరించారు. గ్రామంలో దోమల నివారణకు వెంటనే ఫాగింగ్ చేయాలని పంచాయతీ కార్యదర్శిని ఆదేశించారు. కార్యక్రమంలో జిల్లా సహాయ మలేరియా అధికారి రామచంద్రారెడ్డి, పీహెచ్ఎన్ జీవకళ, హెల్త్ సూపర్‌వైజర్ చిన్నమ్మ, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

పాత స్టాకును డిపోకు అప్పగించండి



దుకాణ పర్యవేక్షకులతో మాట్లాడుతున్న సీఐ శ్రీహరి

చిత్తూరు అర్బన్: ఇప్పటి వరకు ఉన్న ప్రభుత్వ మద్యం దుకాణాల్లోని స్టాకును డిపోలకు అప్పగించాలని చిత్తూరు అర్బన్ ఎక్సైజ్ సీఐ శ్రీహరి ఆదేశించారు. ఆయన మంగళవారం దుకాణాల సూపర్‌వైజర్లతో సమావేశం నిర్వహించారు. బుధవారం నుంచి కొత్త పాలసీ అమల్లోకి వస్తున్న నేపథ్యంలో మద్యం స్టాకు, ఫర్నిచర్, ఇతర సామగ్రిని అధికారులకు అప్పగించాలన్నారు. ఇక ప్రభుత్వ మద్యం దుకాణాల్లో అయిదేళ్ల పాటు పనిచేసిన తమను, ప్రైవేటు దుకాణాల్లో కొనసాగించాలని ఉద్యోగులు కోరారు. ఇది తన పరిధిలో లేని అంశమని, వీలైతే వ్యాపారులకు సిఫార్సు చేస్తామన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

తిరుపతి సిటీ: ఎస్వీయూలో ఎంటెక్ (కెమికల్, సివిల్, కంప్యూటర్, ఎలక్ట్రికల్, కమ్యూనికేషన్స్, మెకానికల్ ఇంజినీరింగ్) కోర్సులలో, ఫార్మసీ కళాశాలలో ఎమ్‌ఫార్మసీ, బీఫార్మసీ కోర్సులలో పేమెంట్ సీట్ల భర్తీ ప్రక్రియ చేపట్టనున్నట్లు రిజిస్ట్రార్ భూపతినాయుడు తెలిపారు. ఆసక్తి, అర్హత గల విద్యార్థులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఈ కేటగిరిలో ఎంటెక్‌లో అడ్మిషన్ పొందడానికి గేట్ -2024 మొదటి ప్రాధాన్యత, పీజీ ఈసెట్ -2024 రెండవ ప్రాధాన్యత, కేవలం బీటెక్ అర్హత ఉన్నవారికి చివరి ప్రాధాన్యత ఇవ్వనున్నట్టు తెలిపారు. అలాగే ఎంఫార్మసీలో చేరడానికి జీ ప్యాట్ 2024 అర్హత సాధించిన వారికి మొదటి ప్రాధాన్యత, పీజీ ఈసెట్ -2024 అర్హత ఉన్నవారికి రెండవ ప్రాధాన్యత, కేవలం బీఫార్మసీ ఉన్నవారికి చివరి ప్రాధాన్యత ఇవ్వనున్నట్టు పేర్కొన్నారు. బీఫార్మసీలో చేరడానికి ఈఏపీసెట్ -2024 రాసిన వారికి మొదటి ప్రాధాన్యత, కేవలం ఇంటర్మీడియెట్ అర్హతగల వారికి చివరి ప్రాధాన్యత కల్పిస్తామని తెలిపారు. మరిన్ని వివరాలకు వర్సిటీ అధికారిక వెబ్‌సైట్‌ను సంప్రదించాలని ఆయన సూచించారు.

కర్ణాటక మద్యం సీజ్



నిందితుడ్ని అరెస్టు చూపుతున్న తాలూక పోలీసులు



టూటౌన్‌లో నిందితుడ్ని అరెస్టు చూపిస్తున్న పోలీసులు

చిత్తూరు అర్బన్: కర్ణాటక మద్యం తరలిస్తున్న బి.శివకుమార్ (34)ను చిత్తూరు తాలూక పోలీసులు మంగళవారం అరెస్టు చేశారు. సీఐ శ్రీనివాసరావు, ఎస్ఐ రమేష్ నగిరిపల్లె–కన్నికాపురం కూడలి వద్ద వాహనాలు తనిఖీ చేస్తుండగా ఓ వ్యక్తి కారులో 15 బాక్సుల కర్ణాటక మద్యం తరలిస్తుండగా పట్టుకున్నారు. నిందితుడిని అదుపులోకి తీసుకుని విచారించగా కర్ణాటక రాష్ట్రం చిక్‌బళాపూర్‌కు చెందిన శివకుమార్‌గా గుర్తించారు. ఇతడి నుంచి మద్యంతో పాటు కారును సీజ్ చేశారు. వీటి విలువ రూ.3.5 లక్షలు ఉంటుందని పోలీసులు తెలిపారు.

ద్విచక్ర వాహనాల దొంగ అరెస్టు

చిత్తూరు నగరంలో ద్విచక్ర వాహనాలను చోరీ చేస్తున్న యువకుడిని మంగళవారం టూటౌన్ పోలీసులు అరెస్టు చేశారు. సీఐ నెట్టికంటయ్య వివరాల మేరకు.. నగర శివారుల్లోని కాణిపాకం బైపాస్ వద్ద పోలీసులు తనిఖీలు చేస్తుండగా ఓ వ్యక్తి పారిపోవడానికి ప్రయత్నించాడు. ఇతన్ని పట్టుకుని విచారించగా, ద్విచక్ర వాహనాలు చోరీ చేస్తున్న విషయాన్ని అంగీకరించాడు. నగరంలోని మంగసముద్రం హౌసింగ్ కాలనీలో ఉన్న వి.వినోద్‌కుమార్ అనే వాసు (26) ఇంటి నుంచి రూ.1.10 లక్షల విలువచేసే మూడు ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకుని అరెస్టు చేసి రిమాండుకు తరలించారు. ఈ సమావేశంలో ఎస్ఐ ప్రసాద్ సిబ్బంది పాల్గొన్నారు.